నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

## జాయింట్ వెంచర్స్‌పై ప్రత్యేక కమిటీ

ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలోని ఆస్తులపై ఉన్న వివాదాల పరిష్కారానికి నలుగురు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని వెంటనే నియమించాలని 'వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం' ఆదేశించింది. వాటిపై ఉన్న వివాదాల పరిష్కారాలను సూచిస్తూ ప్రభుత్వానికి ఈ కమిటీ వారం రోజుల్లో కార్యాచరణ ప్రణాళికను అందజేయాలని సూచించింది.

nipuna
Every Wednesday Free Supplement
13 నవంబర్ 2024
పేజీలు 8


## రోజులు-ప్రాధాన్యం

**నవంబర్ 8**

- ఏటా నవంబర్ 8న వరల్డ్ రేడియోగ్రఫీ డేను నిర్వహిస్తారు. 1895లో రాంట్‌జెన్ ఎక్స్‌రేలను కనుగొన్నారు. అప్పటి నుంచి రేడియోగ్రఫీలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి.

**నవంబర్ 7**

- నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన రోజును నిర్వహిస్తారు. క్యాన్సర్ రాకుండా చూసుకోవడం, ముందస్తుగా గుర్తించడం, ఒకవేళ క్యాన్సర్ సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను అందరికీ తెలియజేసేందుకు ఉద్దేశించింది.




**నవంబర్ 6**

- యుద్ధాలు, సాయుధ పోరుతో పర్యావరణ విధ్వంసాన్ని నిరోధించేందుకు ఉద్దేశించిన రోజు నవంబర్ 6.

## వార్తల్లో వ్యక్తులు

**ట్రంప్**

- అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ దేశంలో నిర్వహించిన ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌ను ఓడించారు. 2025 జనవరిలో ట్రంప్ బాధ్యతలు స్వీకరిస్తారు. సూసి వైల్స్‌ను ఆయన చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమించారు. ఈ బాధ్యతను చేపట్టనున్న తొలి మహిళ ఆమె.



**మయ సందు**

- మాల్డోవా అధ్యక్షురాలిగా మయి సందు ఎన్నికయ్యారు. ఆమె ఆ దేశాధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండో సారి.

**సంజయ్ కుమార్**

- పశ్చిమ కనుమల ప్రాంతాన్ని పర్యావరణం పరంగా సున్నిత ప్రాంతంగా ప్రకటించడంతో గోవా అభ్యంతరం తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్రం సంజయ్ కుమార్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది.


**అనిల్ ప్రధాన్**

- అనిల్ ప్రధాన్‌కు ప్రతిష్ఠాత్మక రోహిణి నాయర్ ప్రైజ్ దక్కింది. గ్రామీణ భారతదేశ అభివృద్ధికి ఆయన చేసిన కృషికి గుర్తుగా ఈ అవార్డ్ దక్కింది.

## అంతర్జాతీయం

**ఐఎంఎఫ్**

- కృత్రిమ మేధ సన్నద్ధత సూచీలో భారత్ 72వ స్థానంలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 174 దేశాల్లో కృత్రిమ మేధ అంశంలో వివిధ దేశాల్లో ఉన్న పురోగతిని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ గణించింది. ఈ జాబితాలో సింగపూర్ అగ్రస్థానంలో ఉండగా డెన్మార్క్, యూఎస్, నెదర్లాండ్స్ 2, 3, 4 స్థానాల్లో ఉన్నాయి. చివరన దక్షిణ సూడాన్ ఉంది.




**ఐఎఫ్‌సీ**

- భారత్‌లో పర్యావరణ మెరుగుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చేందుకు ప్రపంచ బ్యాంకులో ఒక విభాగమైన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. 400 మిలియన్ డాలర్ల నగదును సమకూరుస్తారు.

**తీవ్ర ఆకలి ప్రాంతాలు**

- ప్రపంచ వ్యాప్తంగా 22 దేశాల్లో ఆకలి తీవ్రస్థాయిలో ఉందని ప్రపంచ ఆహార సంస్థ, ప్రపంచ ఆహార కార్యక్రమ వ్యవస్థలు సంయుక్తంగా నివేదిక అందించాయి. సూడాన్, పాలస్తీనా, దక్షిణ సూడాన్, హైతీ, మాలి దేశాల్లో పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉందని ఆ సంస్థలు వెల్లడించాయి.

**అంతర్జాతీయ సౌర కూటమి**


- హర్యానాలోని గురుగ్రామ్ కేంద్రంగా పని చేసే అంతర్జాతీయ సౌర కూటమికి భారత్ మరోసారి అధ్యక్షత వహించనుంది. ఉపాధ్యక్ష పదవికి ఫ్రాన్స్ ఎంపికయ్యింది. 2026 వరకు భారత్ నేతృత్వంలో ఇది కొనసాగుతుంది. సౌరశక్తిని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఇది ఉద్దేశించింది.

**స్విట్జర్లాండ్**

- బుర్ఖాను నిషేధిస్తూ స్విట్జర్లాండ్ నిర్ణయం తీసుకుంది. 2025 జనవరి 1న ఇది అమల్లోకి రానుంది.

**కర్రతో ఉపగ్రహం**

- ప్రపంచంలో తొలిసారి కర్రతో చేసిన ఉపగ్రహాన్ని జపాన్ రూపొందించింది. దీనికి లిగ్నో శాట్ అని పేరు పెట్టింది. స్పేస్ ఎక్స్ రాకెట్‌ను వినియోగించి దీన్ని అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ పైకి పంపనున్నారు.




**ఆస్ట్రేలియా**

- 16 సంవత్సరాల్లోపు చిన్నారులకు సామాజిక మాధ్యమాల అందుబాటు లేకుండా ఆస్ట్రేలియా నిర్ణయం తీసుకుంది. విధిగా ఈ నిబంధనను ఆయా సామాజిక మాధ్యమాలు పాటించాలి.

## జాతీయం

**అలీగఢ్ యూనివర్సిటీపై తీర్పు**

- అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయాన్ని మైనారిటీ విద్యాసంస్థగా పరిగణించలేమంటూ 1967లో ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ విద్యా సంస్థకు మైనారిటీ హోదా అర్హత ఉందా? లేదా? అనే అంశాన్ని ముగ్గురు సభ్యుల కొత్త ధర్మాసనం నిర్ణయిస్తుందని సుప్రీంకోర్ట్ తీర్పులో పేర్కొంది.



**క్షయ నివారణలో పురోగతి**

- క్షయను నిరోధించడంలో భారత్ ప్రగతిని చూపింది. 2015 నుంచి 2023 మధ్య 17.7% కేసుల సంఖ్య తగ్గినట్లు గుర్తించింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 3.3 ప్రకారం 2030 నాటికి క్షయను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలి. 2025 నాటికే దీన్ని సాధించాలన్నది భారత్ లక్ష్యం.

**మదర్సా విద్యా చట్టం రాజ్యాంగబద్ధమే**

- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా చట్టం- 2004 రాజ్యాంగబద్ధమే అని సుప్రీంకోర్ట్ తీర్పు చెప్పింది. ఆ రాష్ట్రంలో మదర్సా విద్యను నియంత్రించేందుకు ఉద్దేశించిన చట్టం ఇది.

**ప్రైవేట్ ఆస్తుల సేకరణ**

- ప్రైవేట్ ఆస్తుల సేకరణ ఇష్టారీతిన చేపట్టడం తగదని సుప్రీంకోర్ట్ తీర్పు చెప్పింది. రాజ్యాంగంలోని 39(బి) అధికరణం ప్రకారం భౌతిక వనరులను అందరికీ దక్కేలా చూసే బాధ్యత ప్రభుత్వానిదే. ఈ అంశం ఆధారంగా ఏకపక్షంగా ప్రైవేట్ వ్యక్తులను స్వాధీనం చేసుకోరాదని సుప్రీంకోర్ట్ తన తీర్పులో వెల్లడించింది.

**వన్యప్రాణి నేర నియంత్రణ బ్యూరో**

- మధ్యప్రదేశ్‌లోని బాంధవ్‌ఘర్ టైగర్ రిజర్వ్‌లో పది ఏనుగులు మరణించాయి. దీనికి సంబంధించి వన్యప్రాణి నేర నియంత్రణ విభాగం విచారణ చేపట్టింది. ఇది చట్టబద్ధమైన సంస్థ. అరికలతో తయారు చేసిన ఆహారం విష పూరితం కావడం వల్లనే ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

**గుజరాత్**

- దేశంలో సెమీకండక్టర్ల విధానాన్ని ప్రకటించిన తొలి రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది. 2027 నాటికి కార్యాచరణను విశదీకరిస్తూ ఈ విధానాన్ని ఆ రాష్ట్రం ప్రకటించింది. ధోలెరాను సెమీకాన్ సిటీగా అలాగే దేశంలో తొలి గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయనుంది. సెమీకండక్టర్ల రంగంలో దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన అంశం ఇది.

**మధ్యప్రదేశ్**

- అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మహిళలకు రిజర్వేషన్లను 33 నుంచి 35 శాతానికి పెంచుతూ మధ్యప్రదేశ్ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

**బీహార్**

- సుల్తాన్‌గంజ్ రైల్వే స్టేషన్ పేరును అజ్‌గైబీనాథ్ ధామ్ అని మార్చనున్నారు. ఆ రాష్ట్రంలో భాగల్‌పూర్ జిల్లాలో ఇది ఉంది.

**భారత ఆహార కార్పొరేషన్**

- భారత ఆహార కార్పొరేషన్‌లో రూ.10, 700 కోట్ల ఈక్విటీని చేర్చాలని కేంద్రం నిర్ణయించింది. ఆహార సరఫరాకు అధిక వడ్డీకి నగదును సమకూర్చుకునే ఇబ్బంది దీనితో ఎఫ్‌సీఐకు తప్పుతుంది.

**పీఎం విద్యాలక్ష్మి**

- రూ.3600 కోట్లతో 22 లక్షల మంది విద్యార్థినులకు ప్రయోజనం చేకూర్చేందుకు పీఎం విద్యాలక్ష్మి పథకాన్ని కేంద్రం ప్రకటించింది. ఉన్నత విద్య చదువుకొనే యువతలకు రుణం ఇస్తారు. అత్యున్నత ప్రమాణాలు పాటించే 860 విద్యావ్యవస్థల్లో సీటు దక్కించుకున్న వారికి ఈ రుణం అందుతుంది. రూ.7.5 లక్షల రుణానికి రుణ గ్యారెంటీ బ్యాంకులకు ఇస్తారు.

**జీవ వైవిధ్య ప్రణాళిక**




- కొలంబియాలోని కాలిలో నిర్వహించిన జీవ వైవిధ్య సదస్సులో భారత్ తన జాతీయ జీవ వైవిధ్య కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. 2030 నాటికి కనీసంగా 30% మృత్తిక, 30% నీరు, 30% తీర ప్రాంతాలను పునరుద్ధరిస్తామని తన విధానంలో భాగంగా ప్రకటించింది.

**కెయిర్న్ ఆయిల్ -గ్యాస్ కంపెనీ**

- కెయిర్న్ ఆయిల్ గ్యాస్ సంస్థ, ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమంతో ఒప్పందం కుదుర్చుకుంది. మీథేన్ ఉద్గారాలను తగ్గించేందుకు ఉద్దేశించిన ఒప్పందం ఇది.

## తెలంగాణ

**యాదగిరి గుట్ట**

- ఇకపై అన్ని రికార్డుల్లో యాదాద్రి బదులు యాదగిరిగుట్టగా వ్యవహారంలోకి తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే యాదగిరిగుట్ట దేవాలయ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



**పెరుగుతున్న నిరుద్యోగం**

- రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతుందని 2023-24 కార్మిక బలగం వార్షిక నివేదికలో వెల్లడయ్యింది. రాష్ట్రంలో 16.6% నిరుద్యోగులు ఉన్నారు. నిరుద్యోగంలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. తొలి రెండు స్థానాల్లో కేరళ, ఆంధ్రప్రదేశ్ నిలిచాయి.

**మంత్రి వర్గ ఉపసంఘం**

- రాష్ట్రంలోని ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క చైర్మన్‌గా ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. సభ్యులుగా ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రత్యేక ఆహ్వానితుడిగా ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు ఉంటారు.

**సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్**

- తెలంగాణతో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో రూ.80 వేల కోట్లతో 6400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు ప్రతిపాదనను ఎన్‌టీపీసీ బోర్డ్ ఆమోదించింది. తెలంగాణలోని రామగుండంలో సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ రెండో దశను ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.29,344.85 కోట్లతో నిర్మించేందుకు బోర్డ్ అంగీకారం తెలిపింది.

**దువ్వూరు ద్వారకానాథ్ రెడ్డి**

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా దువ్వూరు ద్వారకానాథ్ రెడ్డి నియమితులయ్యారు.

**గ్రీన్ ఫార్మాసిటీలో పెట్టుబడులు**

- గ్రీన్ ఫార్మాసిటీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలోని ఐదు దిగ్గజ ఫార్మా కంపెనీలు ముందుకొచ్చాయి. అవి డాక్టర్ రెడ్డీస్, అరబిందో, హెటిరో, లారస్, ఎంఎస్ఎన్. తొలి దశలో ఒక్కో కంపెనీ 50 ఎకరాల స్థలంలో పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదించాయి.



**డెన్సోతో ఒప్పందం**

- వాహన రంగంలోని అంకురాలను అందించేందుకు వీలుగా జపాన్ దేశానికి చెందిన ఆటోమోటివ్ సరఫరాదారు డెన్సోతో టీ-హబ్‌కు భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. వాహన రంగంలో ఆవిష్కరణలకు మరింత అభివృద్ధి చేసేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడనుంది.

## క్రీడలు



**ఒలింపిక్స్ నిర్వహణకు సంసిద్ధత**

- 2036లో ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ తన సన్నద్ధతను వ్యక్తం చేసింది. ఈ మేరకు ఉద్దేశపూర్వక పత్రాన్ని ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీకి అందజేసింది. 2028లో అమెరికాలో, 2032లో ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ఇప్పటికే ఒలింపిక్స్ వేదికలుగా ఉన్నాయి.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

